ఉచిత కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని దన్నానపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నామని ప్రిన్సిపాల్ ఎ.గోపి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కంప్యూటర్ కోర్స్ ఉచిత శిక్షణ మూడు నెలల పాటు నిర్వహించి, పరీక్షలు జరిపి ధ్రువపత్రాలను అందజేస్తామన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత చెందిన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కోర్సు ద్వారా వివిధ పారిశ్రామిక సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 7569077449 నంబరును సంప్రదించాలని తెలిపారు.

ఉద్దానం మునగకు భలే గిరాకీ

ఉద్దాన ప్రాంతంలో పండించే మునగ పంటకు భలే గిరాకీ ఉంది. పదునైన నేలల్లో సాగు చేస్తున్న మునగ పంటకు ఇతర రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలకు ఎగుమతులు అవుతున్నాయి. ఏడాదిలో మూడు పర్యాయాలు దిగుబడి వస్తుంది. ధర కూడా అమాంతంగా పెరుగుతూ ఉంటుంది. మునగకాయ తినడం వల్ల సుమారు 350 రకాల వ్యాధులకు ఉపయోగపడుతుందని వైద్యులు చెబుతున్నారు.

- విరగకాసిన పంట
- ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతులు
- పెరటి నుంచి వాణిజ్య పంటగా...

ప్రజాశక్తి- పలాస

పలాస, ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట, వజ్రపుకొత్తూరు, మందస మండలాలతోపాటు గిరిజన ప్రాంతాల్లో సుమారు ఐదు వేలు ఎకరాల్లో మునగ సాగు చేస్తున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నాయి. ఉద్దాన ప్రాంతంలో జీడి, కొబ్బరి పంటల్లో అంతర పంటగా మునగ పంట సాగు చేస్తుంటారు. ఏడాదిలో మూడు పర్యాయాలు దిగుబడి వస్తుందని, ప్రతి రెండు నెలలకొకసారి దిగుబడి రాక మరో రెండు నెలల పాటు ఖాళీగా చెట్లు ఉంటాయని రైతులు చెబుతున్నారు.

కేజీ రూ. 25-30లు

మునగ పంట దిగుబడి ప్రారంభంలో కేజీ రూ.20 ఉండేది. ప్రస్తుతం రూ.25-30 వరకు ధర పెరిగింది. ఇంకా పెరిగే అవకాశం ఉంది. గతంలో కన్న ఈ పర్యాయం దిగుబడి పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉద్దాన ప్రాంతంలో సాగు చేసే మునగ పంటకు ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. రుచితో పాటు మునక్కాయలు ఎక్కువగా నిలువ ఉంటాయని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న ధర రూ.వంద వరకు కేజీ పెరుగు అవకాశాలు ఉన్నాయని అటు రైతులు, ఉద్యాన శాఖ అధికారులు చెప్పడం విశేషం.

వాతావరణం: 20-25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉన్న ప్రాంతాలు అనుకూలం. 40 డిగ్రీ సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణో గ్రతలో పూత రాలిపోతుంది. మంచును, అధిక చలిని తట్టుకోలేదు.

నేలలు: అన్ని రకాల నేలలు అనుకూలం. అధిక సేంద్రీయ పదార్థాలతో కూడిన ఇసుక నేలలు శ్రేష్టం. నేల ఉదజని సూచిక 6.0-7.5 మధ్యన ఉంటే మంచిది. నెలలో గింజలను పాలిథీన్ సంచుల్లోగానీ, నేరుగా పొలంలో గానీ విత్తుకోవాలి.

విత్తేసమయం: వార్షిక మునగ ఎప్పుడు నాటినా, వేసవి ప్రారంభంలోనే పూతకు వస్తుంది. జూన్ రెండో వారం ఆగస్టు చివరి వరకు భూమిలో నాటుకోవచ్చు. దేశవాళీ రకాలు ఎక్కువగా సాగులో ఉన్నాయి. మొక్క 4-6 మీ. ఎత్తు వరకు పెరిగి విత్తిన 160-170 రోజుల్లో పూతకు వస్తుంది. కాయ పొడవు 65-70 సెం.మీ. కాయబరువు 150 గ్రాములు.

దిగుబడి: మొక్కకు 33 కిలోలు, 200-225 కాయలు. జాఫ్నా: బహువార్షిక రకం. కాయ పొడవు 60-90 సెం.మీ. మెత్తని గుజ్జు, రుచికరంగా ఉంటుంది. రెండో సంవత్సరం నుంచి కాపుకు వస్తుంది. మొదటి రెండు సంవత్సరాలు ఏడాదికి చెట్టుకు 80-90 కాయలను, నాలుగో సంవత్సరం నుంచి చెట్టుకు 500-600 కాయలను పొందవచ్చు.

నేలతయారీ: నేలను 4-5 సార్లు దుక్కి వచ్చే వరకు దున్నాలి. బహువార్షిక రకాలకు 5ఇంటు5 మీ. దూరం, ఏకవార్షిక రకాలయితే 2.5, 2.5 మీ. దూరం ఉండాలి. గుంటల పరిమాణం 45ఇంటు45ఇంటు45 సెం.మీ. ఉండాలి,

ఎరువులు: గింజలు విత్తిన 3 నెలలకు ఒక్కొక్క గుంటకు వంద గ్రాముల యూరియా, 50 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసి నీటిని ఇవ్వాలి. మొక్కలకు ఆరు నెలలకు ఒకసారి, 9 నెలలకు మళ్లీ ఒకసారి వంద గ్రాముల యూరియా, 50 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేసి నీరు పెట్టాలి.

నీటి యాజమాన్యం: విత్తనాలు మొలకెత్తే వరకు ప్రతి 3 రోజులకు నీటితడి ఇవ్వాలి. తర్వాత 10-15 రోజులకు ఒకసారి నీటితడి ఇవ్వాలి. వరుసల మధ్య అంతర పంటలుగా అలసంద, బెండ, వంగ, ఫ్రెంచి చిక్కుడు వంటి పంటలను వేసుకోవచ్చు.

సస్యరక్షణ: చిన్న గొంగళి పురుగులు గుంపులు గుంపులుగా కాండంపై చేరి పత్రహరితాన్ని గీకి తింటాయి. పెద్ద పురుగులు ఆకులన్నీ తిని ఈ నెలను మిగులుస్తాయి.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

ఎగుమతికి సిద్ధంగా ఉన్న మునగ బస్తాలు

జిల్లాలో పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలోని మండలాల్లో ఎక్కువగా మునగ పంట సాగు చేస్తుంటారు. పదునైన నేలల్లో మునగ పంట సాగు చేయడం ద్వారా హైబ్రిడ్ మునక్కాయ కన్నా ఉద్దాన ప్రాంత మునక్కాయ ఎంతో రుచిగా ఉంటుంది. ఈ ప్రాంతంలో పండించమునక్కాయలను పలాస-కాశీబుగ్గ పట్టణాల్లో ఉన్న వ్యాపారులు కొనుగోలు చేసి ఒడిశా రాష్ట్రాలైన కటక్, భువనేశ్వర్, పశ్చిమ బెంగాల్, చెన్నయ్, హైదరాబాద్, విశాఖపట్నం, రాయపూర్, భిలాయ్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ఒక్కరోజులో సుమారు 15 నుంచి 20 టన్నుల వరకు ఎగుమతి చేస్తుంటారు. ఒక సీజన్లో సుమారు 1200 టన్నుల వరకు మునక్కాయలను ఎగుమతి చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అవగాహన కల్పించాలి

మునగ చెట్లు తేలికపాటి గాలులకు, విరిగిపోయి వర్షాలకు నష్టం వాటిల్లుతుంది. మునగ చెట్లు తరచుగా చీడలకు గురవుతున్నాయి. దీంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మునగ దిగుబడి, సస్య రక్షణకు క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖ అధికారులు అవగాహన కల్పించాలి. నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

- యంపల్ల కామేశ్వరరావు, కొండపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి

గాలులకు, చీడపీడలకు నష్టపోయిన మునగ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత ఉత్సాహంతో పంటను పండిస్తాం. అందరం కలిసి కష్టపడి పనిచేస్తేనే ధర గిట్టుబాటు అవుతుంది. కూలీలను పెడితే నష్టం వస్తుంది.

- సొర్ర సావిత్రి, పెద్ద నీలావతి

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రస్తుతం మునగ పూత, పిందె దశలో ఉంది. మరో 15 రోజులు వాతవరణం పొడిగా ఉంటే పంట విరివిగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. రైతులు అవసరమైనప్పుడు తప్పకుండా సస్యరక్షణ చర్యలు చేపడితే కాయ నాణ్యత పెరిగి మార్కెట్‌లో మంచి ధర పలుకుతుంది.

- శంకర్‌దాస్, ఉద్యానవన శాఖ అధికారి, పలాస

శ్రీకాకుళం : నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

లేబరు కోడ్‌లు రద్దు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వరంగ సంస్థలు పరిరక్షించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు జూలై 9న అఖిలభారత సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం నగరంలోని డైమండ్ పార్కు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న 44 కార్మిక అనుకూల చట్టాలను మోడి నాయకత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం 4 లేబర్ కోడ్‌లుగా మార్చారని విమర్శించారు. కార్మిక సంఘాలను బలహీనం చేసి యాజమాన్యాల శ్రమ దోపిడీని మరింత పెంచుకోవడానికి, యజమానుల దోపిడీని, అక్రమ తొలగింపులను, పనిభారాన్ని ప్రశ్నించే పరిస్థితి లేకుండా చేయడం కోసం మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లు తెచ్చిందని అన్నారు. 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచడానికి, యజమానులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించేలా, పెట్టుబడిదారులకు ఉద్యోగులను, కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేందుకు వీటిని తీసుకొచ్చారన్నారు. ఐదేళ్లకొకసారి సవరించాల్సిన కనీస వేతనాలు గడచిన పద్దెనిమిదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం సవరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కనీస వేతనం నెలకు రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు కార్మికులను, అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజన పథకం తదితర స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి అల్లు సత్యనారాయణ, నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, బిఎస్ఎన్ఎల్, పోస్టల్, ఎల్ఐసి, మెడికల్ రిప్స్, కళాసీ, ఎండిఎం, హమాలీ, భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు కె.సూరయ్య, ఎం.ఆదినారాయణమూర్తి, ఎం.గోవర్ధనరావు, డి.వాసుదేవరావు, బి.చిన్నారావు, సింహాచలం, టి.ప్రవీణ, ఎం.త్రినాథ్, పి.యర్రయ్య, బి.చిన్నారావు, కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

పలాస : లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, కార్మికులకు రూ.26 వేలు కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద కార్మిక, రైతు సంఘాలు నిరసన చేపట్టాయి. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఎఐసిసిటియు జిల్లా నాయకులు కె.దుశ్యంత్, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ టి.అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని మెట్టూరు బిట్-3, కాశీపురంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో వసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగారపు సింహాచలం, సిఐటియు నాయకులు పనస రమేష్, పి.కృష్ణ, రమేష్, ఆనంద్, రామకృష్ణ, ఎస్.వెంకటరమణ, వినోద్ పాల్గొన్నారు.

మందస : గిట్టుబాటు ధరలు కల్పించాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సిద్ధారు, ఆర్.కె.పురం మిల్లుల కూడలి వద్ద రైస్‌మిల్ కార్మికులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కె.కేశవరావు, కె.బాలకృష్ణ, బి.మల్లేసు, బి.దుర్యోధన, పి.కూర్మారావు, ఆర్.ఏకాశి, బి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మందస : నిరసన తెలుసుకున్న రైస్‌మిల్లు కార్మికులు

కొత్తూరు : నిరసన తెలుసుకున్న రైస్‌మిల్లు కార్మికులు

ఉద్యోగ భద్రత కల్పించాలి

నిరసన తెలుపుతున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న డ్రైవర్లు సమస్యలు పరిష్కరించాలని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, దశరథ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద మంగళవారం డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలంగా నిరంతరాయంగా సేవలందిస్తున్న డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలతో మారుమూల ప్రాంతాల్లో సమయంతో నిమిత్తం లేకుండా సేవలందిస్తున్నా ప్రభుత్వం గుర్తించకపోవడం శోచనీయమన్నారు. అరబిందో యాజమాన్యం గత పదేళ్ల పాటు అతి తక్కువ వేతనంతో పని చేయించారని అన్నారు. నిత్యావసరాల ధరలు పెరిగినా యాజమాన్యం మాత్రం ఉద్యోగుల సేవలను గుర్తించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. తక్కువ వేతనాలతో జీవనం సాగించడం కష్టమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం వాటా పిఎఫ్, ఇఎస్ఐను యాజమాన్యమే చెల్లించాలన్నారు. చట్టప్రకారం వారాంతపు సెలవులు, జాతీయ సెలవులు అమలు చేయాలన్నారు. విధినిర్వహణకు అవసరమైన సెల్ ఫోన్‌తో పాటు నెలవారీ రీఛార్జ్ చేయాలన్నారు. ప్రమాద బీమా, ఎక్స్‌గ్రేషియా, ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. వాహనా లను యాజమాన్యం మరమ్మతులు చేసేందుకు నిధులు కేటాయించాలన్నారు. వాహనాల సంఖ్యను బట్టి అదనపు, బఫర్ సిబ్బందిని నియమించడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈ నిరసనకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూర య్య, సిఐటియు టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కె.రాజేశ్వరరావు, కె.కృష్ణంనాయుడు, ఎల్.రాంబాబు, పి.వెంకటరావు, ఎం.మణికంఠ, పి.అనంత్, ఎస్.రాజశేఖర్, బి.చిరంజీవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

- మైనింగ్‌పై ఎప్పటికప్పుడు తనిఖీలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజలకు నేరుగా ఫోన్ చేసి ప్రభుత్వ సేవలపై వివరాలు అడిగి తెలుసుకోవాలని, జిల్లాలో అధికారుల పనితీరుపై ప్రజలిచ్చే సమాదానాలు బట్టి అధికారుల పనితీరు అర్థమవుతుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పిజి ఆర్ఎస్, ఎన్ఆర్ఇజిఎస్, రెవెన్యూ, ఆరోగ్యశాఖ, మైనింగ్, పిఎం సూర్య ఘర్, రీ సర్వే, కోర్టు కేసులు, అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. జిల్లాలో ఇప్పటివరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా 61,048 ప్రజా ఫిర్యాదులు నమోదు కాగా, వాటిలో 343 ఫిర్యాదులు గడువు మించినా పరిష్కారం ఎందుకు కాలేదని అన్నారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ శాఖల్లో పెండింగ్ సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. మండలాల వారీగా పనుల పురోగతిలో తేడాలు కనిపిస్తున్నాయని అన్నారు. కొన్ని మండలాల్లో 90 శాతం పనులు పూర్తవుతుండగా, మరికొన్నింటిలో 50 శాతం కూడా చేరలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న ఖరీఫ్ సీజన్ నాటికి సాగునీటి కాలువల మరమ్మతులు చేపట్టాలన్నారు. 22(ఎ) రికార్డుల స్వచ్ఛీకరణ, వివిధ శాఖలతో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల స్థితిగతులు, ముఖ్యంగా వంశధార నదిపై హై లెవల్ బ్రిడ్జి నువ్వలరేవు-మచిలీలపేట రహదారి నిర్మాణాలకు సంబంధించిన అడ్డంకులపై చర్చించారు. నువ్వలరేవు ప్రజలు ఎక్కువ పరిహారం కోరుతుండటంతో, పలాస ఆర్‌డిఒ, వజ్రపుకొత్తూరు తహశీల్దార్, ఆర్అండ్‌బి ఎస్ఇ సంయుక్త సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. లావేరు, ఎచ్చెర్ల మండలాల్లో యూనివర్సిటీ స్థాపనకు 30-40 ఎకరాలు, హైడ్రో కార్బన్ కంపెనీ స్థాపనకు రెండు వేల ఎకరాల భూమిని గుర్తించాలన్నారు. అక్రమ ఇసుక రవాణా, నియంత్రణలేని గ్రానైట్ తవ్వకాలపై కలెక్టర్ స్పందించారు. జిల్లా మైనింగ్ శాఖ కలిసివచ్చి అక్రమ మైనింగ్‌ను గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డివిజనల్ మైనింగ్ కార్యాలయం, జిల్లా మైనింగ్ కార్యాలయం మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. అవసరమైతే జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లాలోని అన్ని గ్రానైట్ క్వారీల తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆరోగ్య, శానిటేషన్, పథకాలు కాలానుగుణ వ్యాధుల నివారణ, నీటి నమూనాల పరిశీలనపై వైద్య శాఖను ఆదేశించారు. పిఎం సూర్య ఘర్ పథకంలో బ్యాంకులు, కాంట్రాక్టర్ల వద్ద ఉన్న పెండింగ్‌లను తొలగించాలన్నారు. ఐసిడిఎస్ పథకంలో నిర్మాణాలను త్వరితగతను పూర్తి చేయాన్నారు. జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఆయుష్ శాఖ, అరసవల్లి ఆలయ ఇఒ సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర రావు, ఉప కలెక్టర్ పద్మావతి, డిపిఒ భారతి సౌజన్య, సిపిఒ ప్రసన్నలక్ష్మి, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ పాల్గొన్నారు.

విభిన్న పరిస్థితులు...

నలుగురు విద్యార్థులకు 12 మంది సిబ్బంది

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పదో తరగతి అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణలో భాగంగా టెక్కలి ప్రభుత్వ ఉన్నత, బాలికోన్నత పాఠశాలల్లో విభిన్న పరిస్థితులు మంగళవారం చోటుచేసుకుంది వివరాల్లోకి వెళ్తే... రెండో రోజు అడ్వాన్స్ సప్లిమెంటరీ హిందీ పరీక్ష నిర్వహించారు. ఇందుకు సంబంధించి బాలికోన్నత పాఠశాల కేంద్రంలో నలుగురు విద్యార్థులు పరీక్ష రాయిల్సి ఉంది. అయితే ఇక్కడ గమనించదగ్గ విషయం ఏమిటంటే నలుగురు విద్యార్థులు హిందీ పరీక్షకు గైర్హాజరయ్యారు. దీంతో ఈ కేంద్రానికి చీఫ్ యు.గణపతిరావు, డిఒ రామకృష్ణ కార్యాలయ సిబ్బంది మొత్తం కలిపి కేంద్రానికి ఆరుగురు అధికారులు విధులు నిర్వహించారు. అదేవిధంగా టెక్కలి బాలుర ఉన్నత పాఠశాలలో 23 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది. ఇక్కడు నలుగురు విద్యార్థులు మాత్రమే ఇక్కడ పరీక్షకు హాజరయ్యారు. మిగిలిన విద్యార్థులు హాజరు కాకపోవడంతో చీఫ్ దాసరి నాగభూషణరావు, డిఒ బి.శేషగిరిలకు ఏం చేయాలో తెలియని పరిస్థితి ఎదురైంది. కాగా, రెండు కేంద్రాలకు సంబంధించి 27 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, కేవలం నలుగురు మాత్రమే హాజరు కావడంతో వీరి కోసం రెండు కేంద్రాల్లో 12 మంది సిబ్బంది విధులు నిర్వర్తించడం గమనించదగ్గ విషయం.

రాజారావు మృతదేహం

పిడుగు పాటుకు వ్యక్తి మృతి

ముగ్గురికి గాయాలు

శ్రీకాకుళం : శ్రీకాకుళం నగర సమీపాన నాగావళి నదిలో మంగళవారం ఉదయం పిడుగుపాడుకు గురై వ్యక్తి మృతి చెందాడు. మృతుడు నగర శివారులో ఉన్న బలగ బూబమ్మ నగర్‌కు చెందిన గేదెల రాజారావు (55)గా గుర్తించారు. మృతుడు రాజారావుతో పాటు ఆయన కుమారుడు నాగార్జున, సమీప గ్రామమైన బుచ్చిపేటకు చెందిన దేశెల్ల రాజారావు, భైరి రామారావులు గాయపడ్డారు. మృతుని రాజారావు ఇంట్లో అమ్మవారి పండగ కోసం గొర్రె మాంసం సిద్ధం చేసేందుకు వీరంతా నాగావళి నదీతీరానికి వెళ్లారు. పొట్టు, తలకాయ మాంసం సిద్ధం చేస్తున్న సమయంలో నగరంలో వర్షం కురిసింది. అదే సమయంలో ఒక్కసారిగా పిడుగు పడడంతో రాజారావు అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన ముగ్గురిని రిమ్స్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించి రిమ్స్‌కు పోస్టుమార్టానికి తరలించారు.

మంత్రులు, ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

పిడుగు పడి రాజారావు అనే వ్యక్తి మృతి చెందడంపై కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌లు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. గాయపడిన ముగ్గురికి మెరుగైన వైద్యం అందించాలని రిమ్స్ వైద్యులను ఆదేశించారు.

క్వారీ తవ్వకాల్లో నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

క్వారీ తవ్వకాల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆర్‌డిఒ కె.సాయిప్రత్యూష హెచ్చరించారు. మండలంలోని ముద్దాడ, కొంగరాంలోని క్వారీలను తహశీల్దార్ బలగ గోపాల్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్వారీ నిర్వహణలో ప్రభుత్వం విధించే నిబంధనలు పాటించాలి, లేనిపక్షంలో చర్యలు పాటించాలని, లేనిచో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్వారీల్లో అన్ని రకాల జాగ్రత్తలు పాటిస్తేనే అనుమతి ఇస్తామన్నారు. క్వారీల్లో ఎంత మేరకు తవ్వకాలు చేపట్టారు, ఎలాంటి ప్రమాణాలు పాటిస్తున్నారని అంశాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.సందీప్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సాయిప్రత్యూష

లక్ష్యాలను చేరుకోకపోతే చర్యలు

డ్వామా పీడీ సుధాకరరావు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాలను సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ వి.సుధాకరరావు హెచ్చరించారు. మండలంలోని కిష్టుపురం పంచాయతీలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సిసి రోడ్లు, పశువుల షెడ్లులు, తోటలో ఫారంపాడ్స్ పనులను మంగళవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఉపాధి కూలీకీ వంద రోజులు పనులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ నిధులలో నిర్మిస్తున్న సిసి రోడ్లు, డ్రెయినేజీలకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. సిబ్బంది అంతా ఐక్యమత్యంతో పనిచేసి మండలానికి మంచి పేరును తీసుకురావాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహించిన క్షేత్రసహాయకులకు, సాంకేతిక సహాయకులకు చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపిఒ జి.హరిప్రసాద్, ఇసి టి.రాంబాబు, టిఎ కుమారిస్వామి పాల్గొన్నారు.

పశువుల షెడ్డును పరిశీలిస్తున్న డ్వామా పీడీ సుధాకరరావు

ఐదుగురు సీనియర్ సహాయకులకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా పరిషత్ యాజమాన్యం పరిధిలో సీనియర్ సహాకులుగా పనిచేస్తున్న ఐదుగురు ఉద్యోగులకు పరిపాలనాధికారులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. వారికి వివిధ మండలాల్లో నియమిస్తూ జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ నియామకపు పత్రాలను అందజేశారు. సంతబొమ్మాళి సీనియర్ సహాయకులు డి.నర్సింగరావును అదే మండలంలో పరిపాలనాధికారిగా నియమించారు. హిరమండలం సీనియర్ సహాయకులు ఎన్.సోమశేఖర్‌ను వంగర ఎఒగా, కొత్తూరు సీనియర్ సహాయకులు ఎ.మార్కండేయరావును రణస్థలం ఎఒగా, జిల్లా పరిషత్ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా ఉన్న కె.ఉమామహేశ్వరరావును శ్రీకాకుళం ఎంపిడిఒ కార్యాలయం ఎఒగా, ఎస్‌సిఎస్‌సిఎస్‌లో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న జి.మధుసూదనరావు పొందూరు ఎఒగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా పరిషత్ యాజమాన్యం ప్రతిష్ట పెంచే విధంగా సమర్థతతో బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి.శ్రీధర్‌రాజు, డెప్యూటీ సిఇఒ డి.సత్యనారాయణ, సి.సెక్షన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రమేష్ పాల్గొన్నారు.

అభినందిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రదర్శన నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి- రణస్థలం

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్. అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. కార్మిక, ఉద్యోగ హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం రణస్థలం రామతీర్థం జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం జంక్షన్ వరకు జాతీయ రహదారిపై ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను, ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకం తదితర స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్.ఐ.సి, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను వేగవంతంగా అమలు చేస్తున్నారన్నారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పి.కాంతమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న విద్యార్థులు

ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు రిమ్స్ సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'జ్ఞాన్- ది మెడికల్ ఫెయిర్' కార్యక్రమంలో భాగంగా నగరంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు రిమ్స్ వైద్య కళాశాలను సందర్శించారు. విభాగాల వారీగా సందర్శించి అక్కడున్న ప్రొఫెసర్లను అడిగి అనుమానాలను నివృతి చేసుకున్నారు. వైద్య విజ్ఞానం పెంపొందించుకునేందుకు వైద్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడున్న లైబ్రరరీ, మానవ అవయవాలు, ఇతర పరికరాలు పరిశీలించిన విద్యార్థులు మానవ శరీర నిర్మాణశాస్త్రంపై ప్రొఫెసర్లతో మాట్లాడారు. రక్త, మూత్ర పరీక్షల లేబరేటరీలను సందర్శించారు. అలాగే సిపిఆర్‌పై ప్రొఫెసర్లు అవగహన కల్పించారు.

మాట్లాడుతున్న ప్రభాకరరావు

ప్రతిఘటన ర్యాలీ వాయిదా

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఈ నెల 21న పాతపట్నంలో ఆత్మ గౌరవం ప్రతిఘటన ర్యాలీని వాయిదా వేసినట్లు కులనిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకరరావు తెలిపారు. స్థానిక అంబేద్కర్ కూడలిలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పాతపట్నం మండలం బైదాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న దళిత మహిళ డాక్టర్ పలక సత్యవాణిపై కొరసవాడకు చెందిన విశ్రాంత మెడికల్ ఆఫీసర్ గణపతి సదాశివ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని అన్నారు. ఆయనపై కేసు నమోదు చేసి 13 రోజులు కావస్తున్నా ఎటువంటి పురోగతి లేదన్నారు. తక్షణమే అడిషనల్ ఎస్‌పి చొరవ చూపాలని నిందితుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి, సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షులు చల్లా రామారావు, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్కా కృష్ణయ్య, జనచైతన్య మండలి రాష్ట్ర కన్వీనర్ కొమ్మల దమయంతి ఉదయపురం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ విజయకుమారి

విద్యాకానుక కిట్లు పరిశీలన

పొందూరు: ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణా విద్యాకానుక కిట్లను సకాలంలో పాఠశాలలకు చేర్చాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయ కుమారి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షలను పరిశీలించిన అనంతరం ఎస్ఆర్‌వికెటి స్టోర్‌ను పరిశీలించారు. వచ్చిన స్కూల్ బ్యాగ్‌ల నాణ్యతను పరిశీలించారు. ఈమెతో ఎంఇఒ-2 పట్నాన రాజారావు ఉన్నారు.

ఒక్క విద్యార్థి - 10 మంది సిబ్బంది

మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న 10వ తరగతి సప్లమెంటరీ పరీక్షా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన హిందీ పరీక్షకు కేవలం ఒక్క విద్యార్థి మాత్రమే హాజరయ్యారు. రాజు అనే విద్యార్థి మాత్రమే పరీక్షకు హాజరుకాగా విద్యార్థిని పర్యవేక్షించేందుకు 10 మంది ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. వీరితో పాటు పరీక్షలను పర్యవేక్షించేందుకు డిప్యూటీ డిఇఒ విజయకుమారి, ఫ్లైయింగ్ స్క్వాడ్ ఉన్నారు.

వాకింగ్ స్టిక్‌లు వితరణ

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని రణస్థలానికి చెందిన కొమ్మొజు నరేష్ అనే వికలాంగుడు నడవడానికి ఇబ్బంది పడుతున్నాడు. ఆయన ఇబ్బందిని గుర్తించిన రణస్థలం హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు మంగళవారం నడవటానికి ఉపయోగంగా ఉన్న రెండు వాకింగ్ స్టిక్‌లను వితరణగా అందించారు. ఈ సందర్భంగా సేవాసంస్థ సభ్యులు మాట్లాడుతూ అపదలో ఉన్న వారికి ముఖ్యంగా వికలాంగులుగా ఉన్న వారిని ప్రేమగా చూసి వారి అవసరాలను గుర్తించి సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, నరేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వాకింగ్ స్టిక్‌లను అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

పాతపట్నం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

శ్రీకాకుళం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండుశంకర్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

నిరుపేదలకు కూడు, గుడ్డ అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటైన టిడిపికి కార్యకర్తలే పునాదులని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. ఇచ్ఛాపురంలో మంగళవారం మినీ మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన ఏడాది లోపే అభివృద్ధి అంటే ఏంటో చూపించిందన్నారు. ఇరిగేషన్ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు సదానంద రౌల్, సీపాన వెంకట రమణ, తాగు నీటి సమస్య పరిష్కారానికి కాళ్ల జయదేవ్, కొండ శంకర్‌రెడ్డి ప్రతిపాదించి తీర్మానం చేశారు. వ్యవసాయం, హార్టికల్చర్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి మాదిన రామారావు, దక్కత ఢిల్లీరావు, మత్స్యకార సమస్య పరిష్కారానికి సురాడ చంద్రమోహన్, బడే సూర్య నారాయణ, బెంతు ఒరియా సమస్యలు పరిష్కారానికి అభిమన్యు సాహు, మెరుగు సూర్యనారాయణరెడ్డి తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక పరిశీలకులు మొదలవలస రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ మణి చంద్రప్రకాశ్, సాలిన ఢిల్లీ, కాళ్ల ధర్మారావు, నందిక జాని, పత్రి తవిటయ్య, కాళ్ల దిలీప్, లీలారాణి, సంతోష్‌పట్నాయక్ పాల్గొన్నారు.

పాతపట్నం : ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యాన తన నూతన గృహం వద్ద మినీ మహానాడు నిర్వహించారు. తొలుత టిడిపి జెండాను కార్యకర్తలతో కలిసి ఎగురవేశారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఇందులో భాగంగా పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం టిడిపి సభత్వం పొంది ప్రమాదవశాత్తు మృతి చెందితే మామిడి అప్పారావు ఛారిటబుల్ ద్వారా రూ.50 వేలు ప్రమాద బీమా ప్రకటించారు.

పలాస : స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి మినీ మహానాడు నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చౌదరి బాబ్జి, మాజీ మంత్రి గౌతు శివాజీలు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఇందులో భాగంగా 11 తీర్మానాలు చేసి ఆమోదించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, శాసనపురి మురళీకృష్ణ, ఎం.నరేంద్ర (చిన్ని), యవ్వారి మోహనరావు, డిక్కల ఆనంద్, తమ్మినాన గంగారామ్, నర్సింహులు, నర్సింహులు పాల్గొన్నారు.

లావేరు: టిడిపితోనే ప్రజల్లో రాజకీయ చైతన్యం వచ్చిందని విజయనగరం పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. మంగళవారం లావేరు మండలం బుడుమూరు సంత తోటలో లావేరు టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఎచ్చెర్ల నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ టిడిపిలో కష్టపడి పనిచేసిన ప్రతీ కార్యకర్తకు పార్టీ గుర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో చౌదరి నారాయణమూర్తి, నియోజకవర్గ పరిశీలకులు అనెపు రామకృష్ణ, ఎచ్చెర్ల మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, ఎచ్చెర్ల, రణస్థలం, జి.సిగడాం మండలాల టిడిపి అధ్యక్షులు బెండి మల్లీశ్వరరావు, లంక శ్యామలరావు, కుమారాపు రవికుమార్, డిజిఎం ఆనందరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం : బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి లక్ష్యంగానే టిడిపి ఆవిర్భవించిందని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శీర రమణ, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పిఎంజెబాబు, ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.వి.రమణ మాదిగ, నియోజకవర్గ పరిశీలకులు చింతల రామకృష్ణ, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న విప్ అశోక్

లావేరు : మాట్లాడుతున్న ఎంపీ అప్పలనాయుడు

భవానీప్రసాద్‌కు అభినందనలు

నరసన్నపేట : ఇటీవల విడుదలైన ఎపిఆర్‌డిసి ప్రవేశం పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థి ఆవల భవానీప్రసాద్ నాలుగో స్థానం సాధించారు. ఈయనకు కళాశాల డైరెక్టర్ సిహెచ్. దుర్గాప్రసాద్, చైర్మన్ పల్లి సూరిబాబు, అధ్యాపకులు మంగళవారం అభినందనలు తెలిపారు.

జైజవాన్

కొత్తూరు : కొత్తూరులో మాజీ సైనికులు ఆధ్వర్యాన మంగళవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. జైజవాన్... జైకిసాన్, జయభారత్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ సైనికులు కొయిలాపు శ్రీనివాసరావు, కూటమి నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, బురడ భాస్కరరావు, చోడవరపు నరసింహామూర్తి, కొయిల సంజీవరావు, గేదెల మన్మథరావు పాల్గొన్నారు.

కవిటి ఎంపిడిఒగా విశ్వేశ్వరరావు

కవిటి: కవిటి ఎంపిడిఒగా విశ్వేశ్వరరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ అదనపు బాధ్యతలు నిర్వహించిన కె.శ్రీనివాసరెడ్డి ఆయనకు పదవీ బాధ్యతలు అప్పగించారు. లావేరు మండలం నుంచి ఉద్యోగోన్నతిపై వచ్చిన విశ్వేశ్వరరావుకు ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, బొరివంక సర్పంచ్ బెందాళం శ్రీరామ్ ప్రసాద్, మాజీ ఎంపిపి పిన్నింటి తిలక్, ఎంపిటిసి పి.కృష్ణారావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, కార్యదర్శులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన కవిటి మండలంలో నిష్పక్షపాతంగా, అంతఃకరణ శుద్ధితో విధులు నిర్వహిస్తానని తెలిపారు.

మానవత్వం చాటుకున్న జనసైనికులు

శ్రీకాకుళం: భవన నిర్మాణ కార్మికునిగా పనిచేస్తున్న సవర రమేష్ ఇటీవల ప్రమాదవశాత్తు మూడు అంతస్తుల భవనం పైనుంచి జారిపడి గాయాలపాలయ్యాడు. జనసేన సభ్యునిగా ఉన్న రమేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలుసుకున్న జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, పాతపట్నం నియోజకవర్గ బిజెపి ఇన్‌ఛార్జి సలాన శరత్‌లు మంగళవారం రిమ్స్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు రూ.13 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కొండా వరప్రసాద్, చిట్టి భాస్కర్, శంకర్ యాదవ్, సిద్ధయ్య, గొర్లె అనురాధ, లత, లక్మి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్

సోంపేట: స్థానిక లోకనాథేశ్వర కలాసీ సంఘ భవనంలో స్థానిక పర్యావరణ పరిరక్షణ సమితి, తీరప్రాంత మత్స్యకార ఐక్యవేదిక ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన జీవ వైవిధ్య ఫొటో ఎగ్జిబిషన్ ఆహుతలను అలరించింది. ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవం పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు పిపిఎస్ అధ్యక్షుడు డాక్టర్ వై.కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పక్షులు, మొక్క జాతులు, కీటకాలు, ఇతర జీవులను తెలియజేసే ఫొటోలను ప్రదర్శించారు. కార్యక్రమంలో మడే దేవేంద్ర వర్మ, గంగాధర్ పట్నాయక్, బార్ల సుందరరావు, తెప్పల కోదండరాం, రంగనాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమను ప్రారంభిస్తున్న దుర్గారావు

పీచు పరిశ్రమతో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కొబ్బరి పీచు పరిశ్రమ ఏర్పాటుతో గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని జనసేన పార్టీ సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు అన్నారు. మండలంలోని పెద్దమురహరిపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన చిన్న తరహా కొబ్బరి పీచు పరిశ్రమను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొబ్బరి డొక్కలు, మట్టలు నుంచి కొబ్బరి పీచును ఉపయోగించి వివిధ ఉత్పత్తులను తయారు చేయొచ్చు అన్నారు. జిల్లాలో మొట్టమొదటిసారిగా ఇలాంటి పరిశ్రమ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కొబ్బరి పీచు ఉత్పత్తి పరిశ్రమ అనేది వ్యవసాయ ఆధారిత ఎగుమతి పరిశ్రమని వ్యర్థాలను ఆస్తిగా మారుస్తుందన్నారు. గ్రామీణ పరిశ్రమల మంత్రిత్వశాఖ ప్రత్యేక దృష్టి పెట్టి మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. భవిష్యత్‌లో ఇంకా ఎక్కువ పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. కొబ్బరి పీచుతో వైవిధ్యమైన కళారూపాలను తయారు చేయవచ్చని కొబ్బరి చిప్పలతో వైవిధ్య ఆకృతులను కళాత్మకంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఈ బొమ్మల తయారీకి నాబార్డు సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి దువ్వాడ వంశీకృష్ణ చౌదరి, అర్జి తులసీరావు, కీలు సునీల్‌వర్మ, కలిశెట్టి దేవదాస్, గోరకల కృష్ణారావు, గోకిన ప్రకాష్ పాల్గొన్నారు.

పంటల మద్దతు ధరల చట్టం చేయాలి

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రమణ తదితరులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

పంటల మద్దతు ధరల చట్టం చేయాలని కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ డిమాండ్ చేశారు. పంటల మద్దతు ధరల చట్టం చేయాలని, రైతుల, కౌలు రైతుల రుణాలు రద్దు చేయాలని, కౌలురైతుల రక్షణకు సమగ్ర చట్టం చేయాలని, వ్యవసాయ రంగాన్ని కాపాడాలని కోరుతూ జి.సిగడాం తహశీల్దార్ ఎం.సరితకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది అన్ని పంటల ధరలు పడిపోయి రైతాంగం తీవ్రమైన సంక్షోభంలో పడిందన్నారు. ధాన్యం, అపరాలు తక్కువ ధరలకే అమ్ముకున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మద్దతు ధరల చట్టం చేస్తామని రాతపూర్వకంగా ఇచ్చిన హామీని అమలు పర్చకుండా రైతాంగానికి ద్రోహం చేసిందన్నారు. మద్దతు ధరల విధానం లేకుండా 'నేషనల్ ఫ్రేమ్ వర్క్ ఆఫ్ అగ్రికల్చర్ మార్కెటింగ్' పేరుతో కొత్త విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీని ప్రకారం మద్దతు ధరలు విధానం లేకపోగా, పంటల కొనుగోలు వ్యవస్థ మొత్తం కార్పొరేట్ కంపెనీల వశం అవుతుందన్నారు. రైతాంగం, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు ఈ విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బొల్లి రమణ, కె.అప్పారావు, కె.చంద్రరావు, టి.చంటి తదితరుల పాల్గొన్నారు.

జీవవైవిధ్యం మనుగడకు తేనెటీగలను కాపాడాలి

ప్రజాశక్తి- రణస్థలం

తేనెటీగలు లేకపోతే భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకమే అవుతుందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని కోష్ట పంచాయతీ పరిధిలోగల డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఉద్యానవన నర్సరీలో రైతులకు తేనెటీగల ఆవశ్యతపై అవగాహనకు పరాగసంపర్క కీటకాకర్షక తోట ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యానవన పంటల ఉత్పాదకతకు 75 శాతం తేనెటీగల వలన జరిగే పరాగసంపర్కమే ప్రధాన కారణమని, మిగిలిన భాగం గాలి, ఇతర కీటకాలు, పక్షులు తదితరాల ద్వారా జరుగుతుందన్నారు. అయితే ఇటీవల కాలంలో వాతావరణ మార్పులు, విచక్షణారహితంగా చెట్ల నరికివేయడం, సెల్‌ఫోన్ రేడియేషన్ వలన సుమారు 90 శాతం వరకూ తేనెటీగలు అంతరించిపోయినట్లు వివిధ పరిశోధనల ద్వారా రుజువైందన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన ఏరియా మేనేజర్ బి.లక్ష్మీ నరసింహమూర్తి, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ శ్రీకాకుళం ఏరియా మేనేజర్ పి. తవిటి నాయుడు, సమన్వయకర్తలు బి.రామస్వామి, కె.మహేశ్వరరావు, పి.నారాయణరావు, రైతులు పతివాడ శ్రీను పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు

ఇనాం భూముల రైతులకు ప్రభుత్వ పథకాలు అందించాలి

డిసిసిబి చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని రొట్టవలసలో ఇనాం భూముల రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తింప జేయాలని డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణకు రైతులు వినతిపత్రం అందించారు. మంగళవారం మండలంలోని షలంత్రిలో ఆయన స్వగృహంలో డిసిసిబి చైర్మన్‌ను కలిసి ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా రొట్టవలస గ్రామ రైతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామంలో 200 ఏళ్ల క్రితం నుంచి ఇనాం భూములను 400 మంది రైతులు వరి, ఇతర పంటలను సాగు చేసుకుని ప్రభుత్వ రాయితీలు పొందే వారమని తెలిపారు. గతంలో ప్రభుత్వం 10 - 1 అడంగల్ ఇచ్చేదని, ఆమదాలవలస ఎస్‌బిఐ శాఖ రుణాలు కూడా మంజూరు చేసేదని రైతులు తెలిపారు. గతంలో వరదలు వచ్చినప్పుడు పంట నష్టపరిహారం కూడా ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తు చేశారు. వైసిపి హయాం నుంచి అడంగళ్లు నిలుపుదల చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి తొత్తడి సత్య నారాయణ, తాడేల వెంకటరమణ, లావేటి పూర్ణారావు, మూడడ్ల గోవిందరావు తదితరులున్నారు.

ఎన్‌టిఆర్ జన్మదిన వేడుకలు

లావేరు: మండలం వెంకటాపురంలో టీమ్ తారక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం జూనియర్ ఎన్‌టిఆర్ జన్మదిన వేడుకలకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి ఎమ్మెల్యే మాట్లాడుతూ హీరోల బర్త్‌డే వేడుకల్లో సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. లుకలాపు అప్పల నాయుడు, మీసాల త్రినాథరావు, అప్పలరాజు, మూర్తి, టీమ్ తారక్ ట్రస్ట్‌సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: సినీనటుడు జూనియర్ ఎన్‌టిఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జన్నల సంతోష్ ఆధ్వర్యాన స్థానిక ఎల్ మ్యాక్స్ థియేటర్ వద్ద కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ మేరకు థియేటర్‌లో ప్రదర్శిస్తున్న యమదొంగ సినిమాకి అభిమానులు హంగా మా చేశారు. కాళ్ల జయదేవ్, బుగత వినయ్, శివ పాల్గొన్నారు.

శ్రీకాకుళం: జూనియర్ ఎన్‌టిఆర్ జయంతిని పురస్కరించు కొని నగరంలోని కొత్తపేటలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరై కేకును కట్ చేసి మాట్లాడుతూ సినీరంగంలో రంగంలో జూనియర్ ఎన్‌టిఆర్ ఎంతో కీర్తి ప్రతిష్టలు పొందారన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లావేరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

శ్రీకాకుళం : కేకు తినిపిస్తున్న ఎమ్మెల్యే శంకర్

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బెజ్జిపుట్టుగ సచివాలయంలో మంగళవారం సర్పంచ్ నారాయణస్వామి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు పొందల కృష్ణారావులు పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఒ పిరియా శ్రీదేవి మాట్లాడుతూ నేలను సారవంతం చేసి చెట్టుకి, పైరుకు అవసరమైన పోషకాలు అందించడంలో పచ్చిరొట్ట కీలక పాత్ర పోషిస్తుందన్నారు. రైతులు తప్పనిసరిగా తమ తోటలు, పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు వేసి భూమిలో కలియ దున్నాయని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారి బెందాళం శ్రీకళ్యాణ్ మాట్లాడుతూ 10 కేజీల కట్టె జనుము విత్తనాలు రూ.545, 10 కేజీల జీలుగు విత్తనాలు రూ.615లకు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ సీజన్‌లో మండలంలో 53 క్వింటాళ్ల జీలుగు, 40 క్వింటాళ్ల కట్టె జనుము విత్తనాలు రైతులకు రాయితీపై అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు అందజేస్తున్న నాయకులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నందిగాం : మండలంలోని పెంటవూరుకు చెందిన పిన్నింటి దొరబాబు (40), నందిగాంకు చెందిన తన మామ సనపల సీతయ్యతో కలిసి శ్రీకాకుళంలో స్నేహితుని ఇంటికి అమ్మవారి పండగలకు మంగళవారం వెళ్తున్నారు. నరసన్నపేట వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిపై సంభవించిన రోడ్డు ప్రమాదంలో దొరబాబు మృతి చెందగా, సీతయ్య గాయపడ్డాడు. మృతుడు అస్సాం రైఫుల్‌లో పనిచేస్తున్నాడు. మృతుడికి కాంచన, ఇద్దరు కుమారులు ఉన్నారు. దొరబాబు మృతితో భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం రోడ్డులో ఈనెల 10న ద్విచక్రవాహనం అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన సంఘటనలో తీవ్రంగా గాయపడిన యలమంచిలికి చెందిన కవిటి ఆనందరావు (54) సోమవారం రాత్రి మృతి చెందారని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. విశాఖ పట్నంలోని కెజిహెచ్‌లో పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరు అరెస్టు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అధికారులు అక్రమ మద్యం, నాటుసారా రవాణాపై మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యాన తనిఖీలు చేశారు. ఈ తనిఖీలో ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు ఒడిశా నుంచి మద్యం సీసాలు అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. కె.షణ్ముఖరావు, నర్తు మోహనరావులను అరెస్టు చేశారు.

విద్యార్థులకు యోగా అవసరం

లావేరు: ప్రతి విద్యార్థి చదువులో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత కావాలంటే యోగా చేయాలని యోగా శిక్షకులు పప్పు మల్లేశ్వరరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం యోగా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా, శారీరకంగా కృంగిపోతున్నారని, చదువుపై శ్రద్ధ చూపడం లేదని అందువలన విద్యార్థులకు యోగా అవసరమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకుడు వీరభద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేయాలి

నరసన్నపేట: కడప జిల్లాలో నిర్వహించనున్న మహానాడును విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. స్థానిక జిఎన్ఆర్ పంక్షన్ హాల్‌లో నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమలపై చర్చించి ఎనిమిది అంశాలను అందరి ఆమోదంతో తీర్మానం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయానికి పంపించారు.

'కలమట'ను కలిసిన డిసిఎంఎస్ చైర్మన్

కొత్తూరు : మండలంలోని మాతల తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం పాతపట్నం మాజీ, టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణను డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్‌ని దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ టిడిపిలో కష్టపడే వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.

ఆత్మీయ సత్కారం చేస్తున్న శిష్యులు

మీ.. 'ధర్మానే'

కవిటి: ధర్మాన ప్రసాదరావు కాంగ్రెస్ పార్టీ హయాంలో రాజశేఖర్‌రెడ్డి తరువాత అంతటి ప్రాధాన్యత కలిగిన నేతగా తనకంటూ రాష్ట్రవ్యాప్తంగా ఓ ప్రత్యేకమైన అనుచరగణాన్ని సంపాదించుకున్నారు. అందులోను ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఆయన సైగచేస్తే కదిలే కార్యకర్తలు వందల సంఖ్యలో ఉన్నారు. అలాంటి ధర్మాన ప్రసాదరావు ఒడిశా ప్రయాణంలో భాగంగా మంగళవారం మండలంలో కొంతసేపు సేదతీరారు. ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ ఆధ్వర్యాన తన శిష్యులు, నాయకులతో కొంత సమయం గడిపారు. నాటి పరిస్థితులు, నేటి స్థితిగతులతో సరి పోల్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన దగ్గర రాజకీయ ఓనమాలు నేర్చుకున్న ప్రస్తుత తరానికి చెందిన నాయకులు ఆయనతో ఆత్మీయ సమావేశ మయ్యారు.

జిజెసి ప్రిన్సిపాల్‌గా తిరుపతిరావు


తిరుపతిరావు

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా టి.తిరుపతిరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆముదాల వలస ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సివిక్స్ అధ్యాపకునిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తిరుపతిరావు ఉద్యోగోన్నతిపై టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఈ మేరకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ కిరణ్మయి నుంచి బాధ్యతలను స్వీకరించారు. పూర్తి స్థాయిలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన తిరుపతిరావుని అధ్యాపకులు అభినందించారు.

తెలుగు మీడియం లేకుంటే నష్టం

శ్రీకాకుళం: జాతీయ విద్యా విధానం 2020లో దేశం అంతటా మాతృ భాషలకు ప్రాధాన్యత పెంచుతూ ఉంటే తెలుగురాష్ట్రంలో మాత్రం మాతృభాషకి మంగళం పాడేటట్లు ఇక్కడ పాలకుల ఆలోచన చేస్తున్నారని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వి.రమణమూర్తి, జి.రమణ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇంగ్లీష్‌తో పాటు తెలుగు మీడియం కూడా సమాంతరంగా ఉండటం వలన ఎక్కువ టీచర్ పోస్టులు నియమించాల్సి వస్తుందని, తద్వారా ఆర్థికభారం పెరగనుందని పాలక వర్గం ఒక్క ఇంగ్లీష్ మీడియం మాత్రమే కొనసాగిస్తూ తెలుగు మీడియంను అటకెక్కించే కార్యాచరణ చేస్తుందన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

ఆమదాలవలస: ప్రకృతి వ్యవసాయ రైతులు, సమాజానికి ఎంతో అవసరమని సిడిఎఫ్ సురేష్ అన్నారు. మంగళవారం చేపేనపేట యూనిట్ కొరపాంలో ప్రకృతి వ్యవసాయ రైతులను సన్మాని ంచారు. ఈ సందర్భంగా సిడిఎఫ్ సురేష్, గ్రామ సర్పంచ్ చేపేన సత్తిరాజు అధ్యక్షతన యూనిట్ ఇన్‌ఛార్జి చిరంజీవి సమక్షంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను సన్మానించామన్నారు. సచివాలయ సిబ్బంది రాజశేఖర్, నాగ భూషణ్, కల్పన, రైతు రమణమూర్తి పాల్గొన్నారు.